

యాలాల: వంతెనపై నుంచి ప్రవహిస్తున్న కోకట్ కాగ్నా నది



వికారాబాద్‌లో.. సర్పన్‌పల్లి జలాశయం అలుగు



మోమిన్‌పేటలో.. అలుగు పోస్తున్న నందివాగు ప్రాజెక్టు

అలుగుల.. గలగల

- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- మత్తడి పారుతున్న జలాశయాలు
- స్తంభించిన రవాణా, నీటమునిగిన పంటలు



యాలాల: అలుగు పారుతున్న జుంటుపల్లి జలాశయం

కుండ పోత వర్షాలతో పల్లెలు, పట్టణాలు చిగురుటాకులా వణికిపోతున్నాయి. వరద నీటితో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు నిండుకుండల్లా మారి, అలుగు పోస్తున్నాయి. ఫలితంగా రహదారులు నీటమునిగి రాకపోకలు స్తంభించి పోతున్నాయి. బషీరాబాద్‌లో కాగ్నానది కన్నెర్ర జేసి పంటపొలాలను తుడిచి పెట్టేసింది. జీవన్గీ వద్ద మహాదేవలింగేశ్వర స్వామి ఆలయాన్ని నీటి ప్రవాహం కప్పేసింది. యాలాలలో జుంటుపల్లి, శివసాగర్ జలాశయాలు పూర్తిస్థాయిలో నిండి.. లోతట్టు ప్రాంతాల ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గోవిందరావుపేటలో చెక్‌డ్యాం నిండి, జలకళ సంతరించుకుంది. ధారూరులో కోట్‌పల్లి ప్రాజెక్టు మూడడుగుల ఎత్తులో అలుగు పారుతోంది. ఫలితంగా తాండూరు–ధారూరు వయా నాగసమందర్, పెద్దేముల్ తదితర ప్రాంతాలకు రవాణా సౌకర్యం నిలిచిపోయింది.

–సాక్షి, నెట్‌వర్క్



వికారాబాద్: రైల్వే కొత్తగడి వంతెన వద్ద నిలిచిన వర్షపునీరు

శిథిలావస్థలో పంచాయతీ భవనం



యాలాల: శిథిలావస్థలో భవనం

యాలాల: బెన్నూరు పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరింది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు భవనం పైకప్పు ఉరుస్తూ.. గది మొత్తం వాన నీటితో తడిసి ముద్దయింది. కార్యకలాపాలకు వీలు లేకుండా పోయింది. దీంతో జీపీ కార్యదర్శి తారకచారి.. ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో విధులు నిర్వహించారు. రూ.20 లక్షలతో కొత్త భవనం మంజూరైనప్పటికీ, అనువైన ప్రభుత్వ స్థలం లేక.. నిర్మాణ పనులు మొదలు కాలేదని సర్పంచ్ పటేల్‌రెడ్డి తెలిపారు.



తాండూరు రూరల్: ఉధృతంగా ప్రవహిస్తున్న బెల్కటూర్ వాగు

కోట్‌పల్లి, కాగ్నా వద్ద పోలీసుల పహారా

జలాశయ ఉధృతిని పరిశీలించిన డీఎస్పీ

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టును వికారాబాద్ డీఎస్పీ కోనం నర్సింహులు.. సర్కిల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ సంతోష్‌కుమార్‌లతో కలిసి సందర్శించారు. ధారూరు నుంచి పెద్దేముల్, కోట్‌పల్లి, బంటారం, మర్పల్లి, కర్ణాటక ప్రాంతాలకు రాకపోకలను స్తంభింపజేసిన రుద్రారం–నాగసమందర్ గ్రామాల మధ్యన ఉన్న వంతెనపై నుంచి ప్రవహిస్తున్న అలుగును పరిశీలించారు. ప్రవాహం వైపు ఎవరు వెళ్లకుండా రెండు వైపులా, స్టేషన్‌ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్య ప్రవహిస్తున్న కాగ్నా నది వద్ద సిబ్బందిని కాపలా పెట్టారు.



ధారూరు: రుద్రారం, నాగసమందర్ మధ్య వంతెనపై నుంచి ప్రవహిస్తున్న కోట్‌పల్లి అలుగును పరిశీలిస్తున్న డీఎస్పీ



మొయినాబాద్‌రూరల్: నీట మునిగిన గులాబీ తోట



తుర్కయంజాల్: అలుగు పారుతున్న మాసబ్ చెరువు

క్లుప్తంగా

బీఎల్‌ఓల పాత్ర కీలకం

- అర్హత ఉన్నవారందరినీ ఓటరుగా నమోదు చేయించాలి
- తహసీల్దార్ కిరణ్‌కుమార్



బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

మోమిన్‌పేట: అర్హత కలిగిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ బీఎల్‌ఓలకు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓ(బూత్ లెవల్ అధికారి)లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఓటరుగా నమోదుకు వచ్చే యువతీ యువకులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అర్హత ఉండి దరఖాస్తు చేసుకోని వారి ఇంటికి వెళ్లి, దరఖాస్తు చేసుకునే విధంగా ప్రోత్సహించాలని చెప్పారు. జాబితా నుంచి మృతి చెందిన వారి పేర్లను తొలగించే ముందుకు వారి కుటుంబీకుల సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఓటర్ల నమోదులో బీఎల్‌ఓల పాత్ర కీలకమని, ఈ ప్రక్రియ నిరంతరాయమని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ షఫీవుల్లా

తాండూరు టౌన్: విస్తారంగా కురుస్తున్న వర్షాలతో వరదనీరు నిలవకుండా పట్టణంలో కొనసాగుతున్న పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్ పనులను మున్సిపల్ కమిషనర్ షఫీవుల్లా మంగళవారం పర్యవేక్షించారు. ఇందిరాచౌక్ నుంచి విలియం మూన్ చౌరస్తా వరకు చేపట్టిన మురుగు కాలువల శుభ్రత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. భారీ వర్షాలు కురుస్తున్నందున ఇళ్ల మధ్య వరదనీరు నిలవకుండా మురుగుకాలువలను శుభ్రం చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు మున్సిపల్ వాహనాల్లో తరలించే ఏర్పాట్లు చేశామని చెప్పారు. పట్టణ వాసులకు ఎలాంటి సమస్య ఉన్నా మున్సిపల్ కార్యాలయంలో తెలియజేయాలని ఆయన సూచించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం



స్థానికులకు అవగాహన కల్పిస్తున్న ఆశలు

కొడంగల్: వరుస వర్షాల నేపథ్యంలో మురుగు జలాలు నిలిచి, వ్యాధులు ముసిరే ప్రమాదం ఉందని ఆశ కార్యకర్తలు అన్నారు. మంగళవారం పలు కాలనీల్లో ఆశలు ఇంటింటికీ తిరిగి వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. దోమ కాటు వలన విష జ్వరాలు వస్తాయని, ఇళ్ల ఎదుట మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దోమ కాటుకు గురికాకుండా రాత్రి వేళల్లో దోమ తెర వాడాలని చెప్పారు.

జీఓ46తో నిరుద్యోగులకు నష్టం

దౌల్తాబాద్: జీఓ 46 ద్వారా ప్రభుత్వం జిల్లాలో పోలీస్ నియామకాల సంఖ్య తగ్గించి, హైదరాబాద్‌కు అత్యధికంగా కేటాయించే యత్నం చేస్తోందని, వెంటనే ఆ జీఓను ఎత్తివేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ విద్యార్థి నాయకుడు పులీందర్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర స్థాయి పోస్టులను జిల్లా స్థాయికి కుదించడంతో నిరుద్యోగ యువతకు అన్యాయం జరుగుతోందని చెప్పారు. జీఓ ద్వారా రాజధానిలోని ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి స్థిరపడిన వారికి లబ్ధి చేకూరులా ఉందని విమర్శించారు. కావున జీఓను రద్దు చేయాలని కోరారు.

ఎస్ఐపై ఎస్పీకి ఫిర్యాదు

బషీరాబాద్: ఫిర్యాదు చేసినా ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ పట్టించుకోవడం లేదని బషీరాబాద్ మండలం నంద్యానాయక్ తండా వాసి అన్నుబాయి అనే మహిళ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తమ ఇంటిస్థలం విషయంలో పక్కింటి వారు కిషన్, దస్లీబాయి వాళ్ల కూతుర్లు ఈ నెల 5న తన భర్త పాండ్యానాయక్‌ను, తనను తీవ్రంగా కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమపై దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేస్తే.. ఎస్ఐ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు చెప్పారు. పోలీసుల నిర్లక్ష్యం వలన తమపై మరోసారి దాడి జరిగిందని వాపోయారు. ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే ఈ కేసులో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ వివరణ ఇచ్చారు. తప్పుడు ఆరోపణలు చేయరాదని సూచించారు.

పంచాయతీ కార్మికుల భిక్షాటన



గోకఫసల్‌వాద్‌లో భిక్షాటన చేస్తున్న కార్మికులు

దౌల్తాబాద్: సమస్యల సాధన కోసం 19 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మెలో భాగంగా మంగళవారం కార్మికులు భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేని యెడలా ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

పర్మినెంట్ చేయాలి

బొంరాస్‌పేట: గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) నియోజకవర్గ అధ్యక్షురాలు నర్మద డిమాండ్ చేశారు. కార్మికుల సమ్మెకు ఆమె మద్దతు తెలిపి మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు నిరవధిక సమ్మెచేస్తున్నారని, ప్రభుత్వం స్పందించి వారి న్యాయమైన కోరికలు నెరవేర్చాలని కోరారు. వీఆర్‌ఏలకు పేస్కేల్ వర్తింపజేసినట్లే.. వీరిని కూడా గుర్తించాలన్నారు. జీపీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు నర్సింహులు సుభాష్, డప్పు రాములు, సుధాకర్, మల్లేశ్‌యాదవ్, సద్దాంహుసేన్ ఉన్నారు.

చిన్నచూపు తగదు

కుల్కచర్ల: ప్రభుత్వం తమను చిన్నచూపు చూస్తోందని పంచాయతీ కార్మికులు ఆరోపిస్తూ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. నిరవధిక సమ్మెలో భాగంగా కార్మికులు మాట్లాడారు. అహర్నిశలు ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న తమను నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్మికులపై ప్రభుత్వానికి కరుణ కలిగే విధంగా చూడాలంటూ వినతి సమర్పించారు.

దాతల సాయం అభినందనీయం

పరిగి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు పేదవారని, వారికి దాతలు సాయం చేయడం అభినందనీయమని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. కాసిం యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ శ్రీదేవి, సురేష్ దంపతులు పరిగి మండలం బసిరెడ్డిపల్లి, నారాయణపూర్ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. సర్కారు బడుల బలోపేతానికి కృషి చేయడం ఎంతో సంతోషమని, విద్యార్థులు తమ లక్ష్యాలను ఎంచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. దాతలు మాట్లాడుతూ విద్యార్థులకు సరైన వసతులు కల్పిస్తే.. ఉన్నత స్థాయికి ఎదుగుతారనే ఉద్దేశంతో తమవంతు సాయం అందజేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సూరప్ప, జేఏసీ చైర్మన్ ముకుంద నాగేశ్వర్, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ రాములు, పాఠశాలల చైర్మన్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై మౌనం తగదు

- మోదీ వెంటనే రాజీనామ చేయాలి
- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు



మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

పరిగి: మణిపూర్ ఘటనలపై స్పందించకుండా మౌనంగా ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. కుకి తెగకు చెందిన ఇద్దరు ఆదివాసి మహిళలను నగ్నంగా ఊరేగించి, లైంగిక వేధింపులకు గురిచేయడాన్ని నిరసిస్తూ.. మంగళవారం మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నా కేంద్రం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నా.. వాస్తవ పరిస్థితులు కనపడటం లేదని, నిందితులను కఠినంగా శిక్షించే వరకు తమ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో నాయకులు హబీబ్, సత్తయ్య, యాదగిరి, శేఖర్, అనిల్, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

'పోస్టుకార్డు' కు తరలిరండి

అనంతగిరి: సమస్యల సాధన కోసం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన 'పోస్టుకార్డు' ఆందోళన కార్యక్రమంలో జిల్లా జర్నలిస్టులంతా పాల్గొనాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌చారి, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీధర్ ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక భూమిక పోషించిన పాత్రికేయులను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం విచారకరమన్నారు. తెలంగాణలో అన్ని వర్గాల అభ్యున్నతికి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నప్పటికీ.. జర్నలిస్టుల విషయంలో మాత్రం ఏ విధమైన పురోగతి కన్పించడం లేదని పేర్కొన్నారు. జర్నలిస్టులకు ఇల్లు, ఇంటి స్థలాలు తదితర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.

క్రమబద్ధీకరణ సంబురాలు

ముఖ్యమంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసిన గ్రామ రెవెన్యూ సహాయకులు



పెద్దేముల్: సీఎం కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

పెద్దేముల్: వీఆర్‌ఏల సంబురాలు మిన్నంటాయి. గ్రామ రెవెన్యూ సహాయకుల వ్యవస్థను రద్దు చేసి, అందులో పనిచేస్తున్న వారిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి, పేస్కేల్ అమలు చేయడంతో పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొంది. మంగళవారం తహసీల్ కార్యాలయం ఎదుట ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు, కార్యదర్శులు రమేష్, సమీర్, పెద్దేముల్ మండల మారేపల్లితండా సర్పంచ్ పాండునాయక్, సీనియర్ నాయకుడు అమిరొద్దీన్, బాలప్ప, జనార్దన్, శ్రీనివాస్, అనిత, రాధ, మజీద్ తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్ఏ) దేవుడని బొంరాస్‌పేట, దుద్యాల మండల వీఆర్‌ఏలు కొనియాడారు. వీఆర్‌ఏలకు సీఎం కేసీఆర్ పేస్కేల్ ప్రకటించడం పట్ల ఆనందం వ్యక్తంచేస్తూ.. ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు రాజ్‌కుమార్, రాములు పాల్గొన్నారు.

యాలాలలో..

యాలాల: వీఆర్‌ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చిత్రపటాలకు రెవెన్యూ సహాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏలు మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో నెట్టుకొస్తున్న తమను.. క్రమబద్ధీకరించడం హర్షణీయమన్నారు. సంఘం మండల అధ్యక్షుడు కృష్ణ, కిషన్, శ్రీకాంత్, దేవేందర్, వెంకటయ్య, మహిపాల్, శ్రీనివాస్ ఉన్నారు.

సంతోషం..

దోమ: సీఎం కేసీఆర్ వీఆర్‌ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం సంతోషంగా ఉందని ఆ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా తహసీల్ కార్యాలయం ఎదుట కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. సీఎం నిర్ణయంతో గ్రామ రెవెన్యూ సహాయకులకు సముచిత స్థానం దక్కిందన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు పుల్లయ్య, శ్రీనివాస్, దస్తయ్య పాల్గొన్నారు.

ఎర్రజెండా పోరాటాలతోనే

అనంతగిరి: వీఆర్‌ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన నేపథ్యంలో వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ సహాయకులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ మాట్లాడారు. ఎర్రజెండా పోరాటాల ఫలితంగానే వీఆర్‌ఏలకు న్యాయం జరిగిందని చెప్పారు. అందుకు సీఎంకు అభినందనలు తెలిపారు. వీఆర్‌ఏల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, సరోజ, రాములు, గోపాల్, పాపయ్య, సత్యమ్మ, అనసూయ, సరోజ, రాములు, రవి, శ్రీను, ఖైరుబేగం, అంజి, అంజయ్య, నాగన్న ఉన్నారు.

స్వాగతిస్తున్నాం..

కుల్కచర్ల: వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేయడంతో రెవెన్యూ సహాయకులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అర్హతను బట్టి తమకు వివిధ శాఖల్లో అవకాశం కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. ఓంప్రకాష్, వెంకటయ్య, రమేష్, బాబు, శ్రీను, స్వప్న ఉన్నారు.



వికారాబాద్‌లో..



కుల్కచర్లలో..



బొంరాస్‌పేటలో..



యాలాలలో..



దోమలో..

పరిశుభ్రతకు ప్రాధాన్యత

దోమ: పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తామని సర్పంచ్ మల్లేశ్ అన్నారు. మంగళవారం దోమ మండలం ఐనాపూర్‌లో పారిశుద్ధ్య పనులు ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుత వర్షాలతో నాలాలు నిండిపోవడం, గుంతల్లో నీరు నిలవడం, తద్వారా దోమలు, ఈగలు వృద్ధి చెంది వ్యాధులు ముసిరే ప్రమాదం ఉందన్నారు. అందుకే పారిశుద్ధ్య పనులు వేగిరం చేశామని తెలిపారు.

వర్షాలతో అప్రమత్తం

దోమ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రవిగౌడ్ అన్నారు. మంగళవారం దోమ మండలం బొంపల్లిలో గ్రామ పంచాయతీ ఆవరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సర్పంచ్ సురేశ్‌తో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారీ వర్షాలు కురుస్తున్నందున అత్యవసర సమయంలోనే బయటకు వెళ్లాలని సూచించారు. ముఖ్యంగా విద్యుత్ స్తంభాలు, సరఫరా పరికరాలకు దూరంగా ఉండాలని చెప్పారు. చెరువులు, కుంటలు నిండి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయని, ప్రవాహంతో ప్రజలు సాహసాలు చేయొద్దని, ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రాణాలకే ముప్పని హెచ్చరించారు. అనంతరం ఎస్ఐని సర్పంచ్ శాలువాతో సన్మానించారు. జీపీ కార్యదర్శి రాములు, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు పవన్ యాదవ్, గ్రామస్తులు శ్రీనివాస్, నాగయ్య, రమేష్ పాల్గొన్నారు.